సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

థ్యాంక్యూ జగన్ మామ

- పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ
- ఆనందంతో మురిసిపోయిన విద్యార్థులు


చిట్టివలసలో జగనన్న ఆణిముత్యాలు అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: పేదరికంలో ఉన్న ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలి... సమాజంలో ఉన్నతంగా ఎదగాలి... అన్న మహా సంకల్పానికి శ్రీకారం చుట్టిన పథకమే జగనన్న విద్యా కానుక. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అన్ని సౌకర్యాలు కల్పించారు.

గత ప్రభుత్వంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించడమే గగనమయ్యేది. కానీ నేడు 3 జతల యూనిఫామ్స్, షూ, పాఠ్య పుస్తకాలతో పాటు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ – తెలుగు డిక్షనరీ, వర్కు పుస్తకాలు, అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ తెరిచిన తొలిరోజే అందించింది. దీంతో పాఠశాలలకు ఎప్పుడు వెళ్దామా అని పిల్లలు ఎదురుచూడటమే కాదు, చదువుపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు. సోమవారం 4వ విడత జగనన్న విద్యా కానుక కిట్లను జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, మంగమారిపేట, కాపులుప్పాడ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. వాటిని తీసుకున్న విద్యార్థులంతా మురిసిపోయారు. మేము చదువుకునేందుకు జగన్ మామ పుస్తకాలు, బ్యాగ్, దుస్తులు ఇచ్చారని తల్లిదండ్రులతో ఆనందం పంచుకున్నారు.


ఎండాడ హైస్కూల్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు


భీమిలిలో జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అప్పలకొండ

భీమిలిలో టీడీపీ కార్పొరేటర్ పంపిణీ

తగరపువలస: భీమిలి మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం టీడీపీ కార్పొరేటర్ గంటా అప్పలకొండ విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకుడు గంటా నూకరాజు, ప్రధానోపాధ్యాయుడు చెట్టి సింహాచలం, ఉపాధ్యాయులు నయీమ్, సుజాత కుమారి, అల్లాడ శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ, అశోక్, లక్ష్మి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, నాగమణి, మల్లిక విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు.

చదువుకోవాలనే ఆశ పెరిగింది



కొత్త తరగతి గది, కొత్త పుస్తకాలు, కొత్త యూనిఫామ్ వస్తాయనే ఆనందంతో స్కూల్ ఎప్పుడు ప్రారంభం అవుతుందో అని ఎదురు చూశాను. కొత్త పుస్తకాలు అన్నీ అందించడంతో బాగా చదువుకోవాలనే ఆశ పెరుగుతోంది. జగన్ మామకు థ్యాంక్యూ చెబుతున్నాం.

– డి.కల్యాణి రెడ్డి, 6వ తరగతి, కాపులుప్పాడ.

యూనిఫామ్స్ బాగున్నాయి



జగన్ మామ ఇచ్చిన కొత్త యూనిఫామ్స్ చాలా బాగున్నాయి. బాగా చదువుకుని పెద్ద అయ్యాక డాక్టర్ అవుతాను. అన్ని పుస్తకాలు ఉండటంతో చదువుకోవాలని ఆశ పెరుగుతోంది.

– జి.హిమశ్రీ, 4వ తరగతి, కాపులదిబ్బడపాలెం.

గతంలో పాఠ్య పుస్తకాలే గగనం..



గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు తరగతులు ప్రారంభం అయ్యేసరికి పాఠ్య పుస్తకాలు అందించడమే గగనమయ్యేది. కానీ ఇప్పుడు పాఠ్య పుస్తకాలతోపాటు వర్కు పుస్తకాలు, యూనిఫామ్స్ వంటివి జగనన్న కిట్ల ద్వారా అందించడం మహా అద్భుత కార్యక్రమం. నేటి తరం విద్యార్థులు జగనన్నకు నిజంగా రుణపడి ఉంటారు.

– గరికిన పరదేశి, ఉపాధ్యాయుడు, కాపులుప్పాడ ప్రాథమిక పాఠశాల.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

ముగిసిన జిల్లా కిక్ బాక్సింగ్ పోటీలు


కిక్ బాక్సింగ్ పోటీల విజేతలతో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, నిర్వాహకులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా ముగిశాయి. జగనన్న ట్రోఫీ పేరుతో షాడో కిక్ బాక్సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు.

ఈ పోటీలకు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతిభ ప్రదర్శించారు. విజేతలకు మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఇక్కడ శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తే తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హనుమంతురావు, స్టేట్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల అప్పారావు, వైఎస్సార్‌సీపీ 5వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకర అప్పారావును నిర్వాహకులు సత్కరించారు. కోచ్‌లు శ్యాంసన్, నూకరాజు, భీమారావు, నాయకులు బండారు శివలక్ష్మి, చేకూరి రజని పాల్గొన్నారు.

అవంతి క్రికెట్ కప్ పోటీలు ప్రారంభం


క్రికెట్ క్రీడాకారులతో ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్

భీమిలి: స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం వుడా మినీ స్టేడియంలో అవంతి క్రికెట్ కప్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం రూ.41.50 లక్షలతో నిర్మించిన స్త్రీశక్తి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో భీమిలి జెడ్పీ బి.రాము, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వార్డు అధ్యక్షుడు అల్లిపల్లి నరసింగరావు, అక్కరమాని రామునాయుడు, కోండ్రు రామసూరప్పడు, కంటుభుక్త ముత్యాలరావు, జీవీ నారాయణ, అనపర్తి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపనోత్సవాలు


పాట్నూరులో ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, స్థానిక నాయకులు


ఐనాడలో కోదండ రామ స్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్ ఆరంజ్యోతి, తదితరులు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో విగ్రహాల ప్రతిష్టాపనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐనాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండ రామస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ ఆరంజ్యోతి, భీమునిపట్నం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరాడ పాపారావు, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణమూర్తి రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు మామిడి శివరామకృష్ణ పాల్గొన్నారు.

- పాట్నూరులోని కోదండ రామ స్వామి ఆలయం ప్రాంగణంలో గోదా రంగనాథుల ఉత్సవ విగ్రహాలు, ధ్వజ స్తంభం ప్రతిష్టించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బేపల గురునాయుడు, అవనాపు బంగారునాయుడు, తోనంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలోని స్మృతి వనంలో ఈ నెల 16న దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ తెలిపారు. పద్మనాభంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెలలో కళాకారులను సంఘటితం చేయడం, క్రీడాకారుల కృషిని అభినందించడం, జాతీయ అవార్డులు, పద్మశ్రీ అవార్డుల గ్రహీతలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులను కలిసి అభినందించడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆయనతోపాటు బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు ఉన్నారు.

'స్పందన'కు 9 అర్జీలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు 9 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్ పరిధిలోని మధురవాడ, ఆరిలోవ, సాగర్‌నగర్, ఎండాడ పరిసర ప్రాంతాల్లోని సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మహిళ మృతదేహం

తగరపువలస: సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగా ఆదివారం సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని మహిళ హత్యకు గురైంది. ఆమె మృతదేహాన్ని భీమిలి పోలీసులు రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తించారు. ఆస్పత్రి ఎదురుగా సంతపేటకు చెందిన కల్లంలో పొట్టపై చీరిన గాయంతో ఈమె మృతదేహం అనుమానాస్పద స్థితిలో పడి ఉంది. మృతురాలి వివరాలు ఎవరికైనా తెలిస్తే 91826 94835 నంబరులో తెలియచేయాలని భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి కోరారు.

'రఘు'లో అంతర్జాతీయ వర్క్‌షాప్

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అడ్వాన్సెస్ ఆన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఫర్ స్పేస్, వెహికలర్ అండ్ గ్రౌండ్ అప్లికేషన్స్ అనే అంశంపై ఒక్కరోజు అంతర్జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. అమెరికాకు చెందిన రావూస్ కన్సల్టెంట్ సీఈవో డాక్టర్ సుధాకర్‌రావు ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. కళాశాల ఈసీఈ విభాగాధిపతి పి.సతీష్ రామచౌదరి సమన్వయకర్తగా వ్యవహరించారు. భారత్, అమెరికా, టర్కీ, తైవాన్ దేశాలకు చెందిన సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, ఆచార్యులను భాగస్వాములను చేస్తూ ప్రత్యక్ష జ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతలను పరిచయం చేస్తూ సదస్సు నిర్వహించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఆచార్యులు ఆర్.రమణారెడ్డి, రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటైన బొగోలు సురేంద్రరెడ్డి, S/o. భాస్కరరెడ్డి, విశాఖపట్నం వారు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ – ఏ మరియు షెడ్యూల్–బి దాఖలా స్థిరాస్తులను శ్రీ పాకలపాటి అమృతవర్ధన రావు, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారి వద్ద నుండి కొనుగోలు చేయ నిశ్చయించి అడ్వాన్స్‌గా కొంత రొక్కం చెల్లించియున్నారు. కావున లోకులకు ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు గాని అక్షేపణలు గాని ఉన్నయెడల తగిన సాక్ష్యాధారాలతో ఈ దిగువ ఇచ్చిన అడ్రస్ నందు 15 దినములలోపు సంప్రదించవలెను. లేనియెడల సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తులు నిర్వివాదముగా భావించి నా క్లయింటు కొనుగోలు చేసెదరు.

షెడ్యూలు 'A స్థిరాస్తి'
విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం కాపులుప్పాడ గ్రామంలో సర్వే నెం. 371/2 లోగల య. 4.06 సెంట్లు గల వ్యవసాయ భూమికి (DR నెం. 225/1402 తేది. 17-11-1992 ప్రకారం పట్టాభూమి) సరిహద్దులు : ఉత్తరం : కొండ, దక్షిణం : వంద అడుగుల రోడ్డు, తూర్పు : అమ్మకపుదారుని ఇతర భూమి, పడమర : గవర్నమెంట్ వారి భూమి

షెడ్యూలు 'B స్థిరాస్తి'
విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం కాపులుప్పాడ గ్రామంలో సర్వే నెం. 372/1 లోగల య. 1.17 సెంట్లు గల వ్యవసాయ భూమికి (DR నెం. 225/1402 తేది. 17-11-1992 ప్రకారం పట్టాభూమి) సరిహద్దులు : ఉత్తరం : కొండ, దక్షిణం : వంద అడుగుల రోడ్డు, తూర్పు : ఇరుగు పొరుగు వారి భూమి, పడమర : అమ్మకపుదారుని ఇతర భూమి.

K.MADHUSUDANA RAO, T.MOUNIKA
Advocates
2nd Floor, Akhila Arcade, Rama Talkies Road, Asilmetta, Visakhapatnam. Cell : 99890 12912

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభం శాఖ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయాలకు వెళ్లడం అలవరచుకుని విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, బోని చైతన్య, తోనంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గది ప్రారంభం


చిట్టివలసలో డిజిటల్ తరగతి గది ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున డిజిటల్ తరగతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు డిజిటల్ బోర్డు పనితీరును టెక్నీషియన్లు వివరించారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మ హుండీల ఆదాయం రూ.4.67 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవా సమితి సభ్యులు

తగరపువలస: సంగివలస కొత్తమ్మతల్లి హుండీల ఆదాయం సోమవారం లెక్కించగా రూ.4,67,949 వచ్చినట్టు ఈవో బి.ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచి సోమవారం వరకు 45 రోజులకు సంబంధించి ఈ ఆదాయం వచ్చిందన్నారు. హుండీల లెక్కింపునకు నగరంలోని రైల్వే న్యూ కాలనీ ఈవో పి.ఎల్.ఎస్.రాజు ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించారు. గుమస్తా కోరాడ శ్రీను పాల్గొన్నారు.

సైకిల్ రైడర్ సంపత్‌కు అభినందనలు


సైకిల్ రైడర్ సంపత్‌ను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు సైకిల్ యాత్ర చేపట్టిన బుల్లయ్య కళాశాల విద్యార్థి సాయి సంపత్ ఈ నెల 2న విశాఖ చేరుకున్నాడు. యాత్ర విజయవంతంగా పూర్తి చేసిన సంపత్ సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన సంపత్‌ను అభినందించారు. సైకిల్‌పై మే 8న విశాఖలో యాత్ర ప్రారంభించి 25 రోజులపాటు సుమారు 2 వేల కిలోమీటర్లు ప్రయాణించి బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు యాత్ర సాగించినట్టు సంపత్ తెలిపాడు. తెలుగు రాష్ట్రాల నుంచి సైకిల్‌పై మూడు సరిహద్దులను చేరుకున్న చిన్న వయస్కుడిగా రికార్డు సాధించానని తన యాత్ర అనుభవాలను వివరించాడు.

ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ


ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీదేవి ఆలయ 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ సోమవారం ఘనంగా జరిగింది. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఉదయం విగ్రహావిష్కరణ చేశారు.

అనంతరం హారతులు అందజేశారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు


వాంబేకాలనీలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురవాడ: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పలుచోట్ల విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాంబేకాలనీలో జీవీఎంసీ 5, 6, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే శ్రీనివాసరావు పరిశీలించారు.

అనంతరం ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, డీఎమ్‌హెచ్‌వో కె.జగదీశ్వరరావు, డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో రామిరెడ్డి, వుమెన్ హెల్త్ ఆఫీసర్ ఉమ, జెడ్పీ కనక మహాలక్ష్మి తదితరులతో కలిసి పేదలకు ఉచితంగా మందులు అందించారు. అనంతరం నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి మాట్లాడారు. అనునిత్యం ప్రజల మధ్య ఉండడమే తనకు ఇష్టమని, అందుకే అందరి మధ్యలో జన్మదిన వేడుకలు నిర్వహించుకుంటున్నానని చెప్పారు. వాంబేకాలనీని మోడల్ కాలనీగా అభివృద్ధి చేస్తానన్నారు. పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.1.3 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. శిబిరంలో 500 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పద్మనాభం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా పద్మనాభంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు కేక్ కట్ చేశారు. నాయకులు ఈర్ల ఈశ్వరరావు, కోండ్రోతు శ్రీనివాసరావు, పల్లంటి చిన్నారావు, బేపల గురునాయుడు, చందక శ్రీను, పల్లి గోవింద, బోని సన్యాసినాయుడు, అముజూరి అప్పారావు, మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, సీర సూరప్పడు, రామసింగు ముత్యాలనాయుడు, కర్రి శ్రీను, కనకల ప్రకాష్ పాల్గొన్నారు.

150 మంది మహిళలకు చీరల పంపిణీ

పీఎం పాలెం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పీఎంపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు రాజేశ్వరి, 6వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, పార్టీ మహిళా నాయకులు మామిడి వరలక్ష్మి, రమణమ్మ ఆధ్వర్యంలో 150 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ 6, 7 వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు గుంటుబోయిన సంజీవ్, సీయాద్రి కనకరాజు పాల్గొన్నారు.

తగరపువలస: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బింగి హరికిరణ్‌రెడ్డి సోమవారం వంద మంది పేదలకు భోజన ప్యాకెట్లు అందించారు. పార్టీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, పందిరి విజయ్‌కుమార్, రాంభుక్త ప్రభాకర్ నాయుడు, మునకాల ఆదినారాయణ రెడ్డి, దుంప సాయిరెడ్డి, బోర రామారావు, నీలాపు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ఆర్‌ఆర్ ఓల్డేజ్ హోమ్‌లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, నొడగల రాంబాబు, మాదు చంటి, పవన్ పాల్గొన్నారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్టు 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు.

కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి.ఎస్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిళ్లా రమణమూర్తి, కశ్లేపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, కోరాడ నరసింహారావు, పద్మజ, ఎం.విజయగోపాల్, వేదుల కామేశ్వర శర్మ, గుండాన జోగారావు, సుజాతమూర్తి పాల్గొన్నారు.

కంటి శుక్లాలపై అవగాహన అవసరం

ఆరిలోవ: కంటి శుక్లాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పంకజ్ పరశురాం తెలిపారు. ప్రతి జూన్ నెలను శుక్లాల మాసంగా గుర్తిస్తారు. దీంతో ఆస్పత్రిలో కొద్ది రోజులుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన శుక్లాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. వయసు రీత్యా సాధారణంగా కంటిలో శుక్లాలు ఏర్పడతాయన్నారు. మధుమేహం, మూత్ర పిండాలు వ్యాధి, కంటి గాయాలు, కంటి ఇన్‌ఫెక్షన్ తదితర వాటితో బాధపడేవారితో పాటు ఏదైనా వ్యాధి కోసం దీర్ఘకాలిక మందులు వాడుతున్నవారిలో, పొగ తాగుతున్న వారిలోను ఈ శుక్లాలు పెరుగుతాయన్నారు. ఇవి వాహనాలు నడుపుతున్నప్పుడు, పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆటంకంగా మారుతాయన్నారు. అందుకే వాటిని తొలగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం శుక్లాల శస్త్ర చికిత్స పురోగతి చెందిందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం కంటి అద్దాలు లేకుండా సమస్య పరిష్కరించవచ్చన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com